

పొలంలో వరి మొలక చల్లుతున్న రైతు

# ఆశల సేద్యానికి రెడీ

- ఉమ్మడి జిల్లాలో యాసంగి ప్రణాళిక సిద్ధం
- ఈ సీజన్‌లో 10,51,178 లక్షల ఎకరాల సాగు లక్ష్యం
- మొత్తంగా వరిదే పైచేయి
- 9,49,422 లక్షల ఎకరాల్లో వేస్తారని అంచనా
- ఇప్పటికే చాలాచోట్ల వరి నార్లు పోసిన రైతులు
- అందుబాటులో ఎరువులు నిల్వలు, విత్తనాలు



పొలం దున్నుతున్న రైతు

కరీంనగర్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఒక పక్క వానకాలం పంట ఉత్పత్తులను విక్రయిస్తూనే జిల్లా రైతులు యాసంగి సాగులో నిమగ్నమయ్యారు. తుఫాన్ ప్రభావంతో ధాన్యం విక్రయాలకు కొంత అంతరాయం కలిగినా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై కొనుగోళ్లను వేగవంతం చేసింది. ఇటు యాసంగి సాగుకు రైతులు వరి నార్లు పోసుకుంటున్నారు. హుజూరాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తాన్‌బాద్, ఎలిగేడు మండలాల్లో ఇప్పటికే రైతులు నాట్లు వేస్తున్నారు. మక్క, ఆరుతడి పంటలు కూడా సాగవు తున్నాయి. ఎప్పటిలాగే ఈసారి కూడా వ్యవసాయ అధికారులు వరికి ప్రాధాన్యత ఇచ్చి ప్రణాళిక రూపొందించారు. వర్షాలు అనుకూలించి, భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో బావులు, బోర్ల కింద పెద్ద మొత్తంలో వరి సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టుల్లో కూడా అను కూలంగా నీరు ఉన్నందున ఆయకట్టు, చెరువుల పారకం ప్రాంతాల్లో కూడా వరి సాగు విస్తరించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఎక్కువగా వరికే మొగ్గు చూపుతున్నారు. అధికారులు కూడా అందుకు తగినట్లుగానే ప్రణాళిక సిద్ధం చేశారు.

### జిల్లాలో 3,00,178 ఎకరాలు

జిల్లాలో వరికి అగ్రస్థానం కల్పిస్తూ 2023–24 యాసంగి ప్రణాళికను వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. ఇందులో 2.68 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేయగా, మక్క 25 వేలు, పెసర 50, పత్తి 90, మినుములు 35, నువ్వులు 30, పల్లి 450, పసుపు 10, పొద్దుతిరుగుడు 350, పొగాకు 150, ఇతర పంటలు మరో 5,983 ఎకరాల్లో కలిపి 3,00,178 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటి వరకు వరి 2,925, మక్క 1,298, పెసరా 2, బబ్బెర 19, పల్లి 210, పొగాకు అంచనాకు మించి 156, ఇతర పంటలు మరో 102 ఎకరాల్లో సాగైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ తెలిపారు.

### అందుబాటులో ఎరువులు..

జిల్లాలో సాగు అంచనాలను బట్టి వ్యవసాయ అధికారులు ఎరువుల కోసం సిఫారసు చేస్తుంటారు. ఈ సీజన్‌లో 42,626 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 1,275 మెట్రిక్ టన్నుల వాడకం జరిగింది. ఇంకా 11,892 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ విషయానికి వస్తే 8,477 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ఇప్పటికే 77 మెట్రిక్ టన్నులు వాడుకున్నారు. ఇంకా 7,441 మెట్రిక్ టన్నుల నిలువ ఉంది. కాంప్లెక్స్ 22,258 మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే ఇప్పటికే 526 మెట్రిక్ టన్నులు వాడుకున్నారు. ఇంకా 25,164 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఎంఓపీ 6,124 మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే ఇప్పటికే 386 మెట్రిక్ టన్నులు వాడుకున్నారు. ఇంకా 2,301 మెట్రిక్ టన్నులు నిలువ ఉంది. అవసరం మేరకు, రైతులు వాడుకునే విధానాన్ని బట్టి ఎరువులు అందుబాటులో ఉంచుతామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

### ఎరువులు రెడీగా ఉంచాం



జిల్లాలో ఈ యాసంగి సాగుకు 66,749మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇందులో 16,644మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 7250, డీఏపీ 1601, కాంప్లెక్స్ 6885, ఎంఓపీ 507, ఎస్ఎస్‌పీ 399మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. వరి నాట్లు ఈ నెల చివరి వారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంకా అవసరమైన ఎరువులను తెప్పిస్తాం.

- దోమ ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి (పెద్దపల్లి)

### ఈ నెలాఖరు కల్లా నాట్లు పూర్తి



ఈ సీజన్‌లో 3.5 లక్షల ఎకరాల్లో పంటలు రైతులు సాగు చేయనున్నట్లు అంచనా వేస్తున్నాం. వానాకాలం వరి పంట కోతలు దాదాపు పూర్తయ్యాయి. జిల్లాలో 3,03,000 ఎకరాల్లో వరి సాగుకుగాను డిసెంబరు మొదటి వారంలో సుమారు 25 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. మిగితా రైతులు నాటు వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. మక్క 27,200 ఎకరాల్లో అంచనాకుగాను ప్రస్తుతం 19 వేల ఎకరాల్లో సాగు ప్రారంభించారు. డిసెంబరు చివరి వారం వరకు దాదాపు వరి నాట్లు పూర్తి అవుతాయని అంచనా వేస్తున్నాం.

- పీ సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ( జగిత్యాల)





సిరిసిల్లలో పొగ మంచులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు



సిరిసిల్లలో చలి మంట కాగుతున్న ప్రజలు



మానకొండూర్‌లో కప్పుకున్న పొగ మంచు

# ఇగమే ఇగం

## కొనసాగుతున్న తుఫాన్ ఎఫెక్ట్

- వెంటాడుతున్న మిగ్‌జాం
- ఉమ్మడి జిల్లాపై ప్రభావం
- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలి తీవ్రత
- ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టమైన పొగమంచు
- రోజంతా ఈదురు గాలులు
- సాయంత్రం 4 గంటల నుంచే గజగజ
- వణుకుతున్న జిల్లావాసులు



కరీంనగర్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : మిగ్‌జాం తుఫాన్ ప్రభావం తగ్గినా చలి మాత్రం వీడడం లేదు. ఉత్తరాది ప్రాంతం నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో జిల్లాలో వణుకు పుట్టింది. ఎక్కడ చూసినా జనం ఇగంతో గజగజా వణికిపోతున్నది. నవంబర్ నెల చివరి నుంచే చలి తీవ్రత పెరుగుతున్నది. ముఖ్యంగా ఈ నెల 4 నుంచి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మూడు నాలుగు రోజుల పాటు మిగ్‌జాం తుఫాన్ కారణంగా వర్షాలు కురిశాయి. దీంతో చలి తీవ్రత మరింత పెరిగింది. ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి కనిపించింది. ఈ నెల 6న పగటి ఉష్ణోగ్రతలు సాధారణం స్థాయిని దాటి పడిపోయాయి. ఆ రోజు 23 డిగ్రీలకు చేరుకున్నాయి. జిల్లాలో సాధారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు 22 నుంచి 23 డిగ్రీలు నమోదవుతాయి. ఈ నెల 6 నుంచి 20కి పడిపోయాయి. శుక్రవారం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పగటి ఉష్ణోగ్రతలు కూడా 28 దాటడం లేదు.

### ఉత్తరాది నుంచి శీతల పవనాలు

సాధారణంగా డిసెంబర్‌లో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. మిగ్‌జాం తుఫాన్ కారణంగా వారం నుంచి విపరీతంగా చలి పెరిగింది. వారం పది రోజుల కిందటి వరకు పగటి ఉష్ణోగ్రతల్లో మార్పు లేక పోవడంతో చలి తీవ్రత సాధారణంగానే ఉంది. ప్రతి శీతాకాలం సీజన్‌లో ఉత్తరాది నుంచి శీతల గాలులు వీస్తుంటాయి. సీజన్ పూర్తయ్యే వరకు కనీసం రెండు మూడు విడతల్లో ఈ శీతల గాలుల ప్రభావం ఉంటుంది. ఈ సీజన్‌లో ఈ గాలులు వీస్తుండడం ఇదే మొదటి సారి. దీనికి తోడు తుఫాన్ ప్రభావం చూపింది. ఈ కారణంగా చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. నాలుగైదు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడాలు వస్తున్నాయి. ఈ నెల 6 నుంచి కనిష్ట ఉష్ణోగ్రతలు 20కి పడిపోయాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా 23 నుంచి 28 డిగ్రీలకు తగ్గుతుండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రీతిలో వాతావరణం ఉంటున్నది. నవంబర్ వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32 నుంచి 31 డిగ్రీలు నమోదయ్యాయి. వారం పది రోజులుగా ఉత్తరాది నుంచి శీతల గాలులు వీస్తుండటం, తుఫాన్ ఏర్పడడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.

### చలి గుప్పిట్లో జనం

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రీతిలో వాతావరణం కనిపించడం, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో జిల్లా ప్రజలు వణికి పోతున్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది. రాత్రి వేళ 20 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పొద్దంతా ఎవరి విధుల్లో వారు బయటికి వెళ్తున్న జనం సాయంత్రం కాగానే ఇండ్లకు చేరుతున్నారు. రాత్రిళ్లు విరివిగా మంచుకురుస్తోంది. దీంతో రాత్రి వేళ బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఇక ఉదయం 8 గంటల వరకు దుప్పటి ముసుగు తీయడం లేదు. జిల్లాలోని అనేక ప్రాంతాలు ఉదయం పది గంటల వరకు మంచుకప్పుకుని ఉంటోంది. దీనికి తోడు గాలిలో 42 శాతం తేమ ఉంటోంది. గంటకు 7 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో చలి గాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం కాస్త వాతావరణం పొడిగా అనిపించి వెచ్చదనం కనిపిస్తున్నా సాయంత్రం 4 గంటల నుంచే చలి ప్రభావం కనిపిస్తోంది. ఉదయం దిన చర్యలు ప్రారంభించే పాల వ్యాపారులు, పేపర్ బాయ్స్, చాయ్ దుకాణావాలాలు, కూరగాయల వ్యాపారులు చలిలో వణుకుతూనే పనులు ప్రారంభించుకోవల్సి వస్తున్నది.

### ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ



చలి తీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తులకు విపరీతమైన గిరాకీ పెరిగింది. నగరంలోని పలు చోట్ల ఉన్ని దుస్తుల అమ్మకాలు సాగుతున్నాయి. అస్సాం, నేపాల్, మిజోరాం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులకు ఈసారి పంట పండుతోంది. దుప్పట్లు, జర్సీలు ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తులకు అమాంతం ధరలు పెంచినా తప్పని పరిస్థితిలో కొనక తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్, తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉన్ని మార్కెట్‌లో జనం పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. పిల్లలకు, తమకు అవసరమైన దుస్తులు కొనుగోలు చేసుకుంటున్నారు. హైవేల వెంట, నగర శివార్లులో కూడా ఈసారి ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు.

### మరికొద్ది రోజులు ఇలాగే..

ఉత్తరాది నుంచి శీతల గాలులు వీస్తుండడంతో ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులు మరి కొద్ది రోజులు ఇలాగే కొనసాగే అవకాశాలు ఉన్నాయి. రాబోయే పది రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 25డిగ్రీలకు పడిపోవచ్చని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 15 వరకు పడిపోతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చలికి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని మరో పక్క వైద్యులు కూడా సూచిస్తున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు చిన్న పిల్లలు, వృద్ధులు, అస్తమా వ్యాధి గ్రస్తులు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పుంజుకుంటున్న రిజిస్ట్రేషన్లు

- ఎన్నికల కోడ్‌తో ఇన్నాళ్లూ మందగించిన కొనుగోళ్లు
- 4న ముగిసిన ఎన్నికల నిబంధనావళి
- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు క్రయవిక్రయదారుల తాకిడి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా మందగించిన భూముల కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నాయి. ఎన్నికల కోడ్‌తో స్థిరాస్తుల క్రయవిక్రయాలు మందగించగా, అత్యధికశాతం రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. తిరిగి ఈ నెల 4న సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ ముగియడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు మళ్లీ బిజీగా మారాయి. నాలుగు రోజుల నుంచి భూముల క్రయవిక్రయాలు పెరుగుతుండగా, కొనుగోలు, అమ్మకందారుల రాకపోకలతో కళకళలాడుతున్నాయి.



స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయము

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 8 : రాష్ట్ర శాసన సభా ఎన్నికలతో రెండు నెలలుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు నాలుగైదు రోజులుగా క్రమంగా పెరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో క్రయ, విక్రయాలు పెరుగుతుండగా, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి. ఎన్నికల షెడ్యూలుకు ముందు సెప్టెంబర్ నెలలో ఉమ్మడి జిల్లాలో స్టాంపు డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ₹25 కోట్ల 5 లక్షల 92 వేల ఆదాయం సమకూరింది. 7843 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. అయితే, అక్టోబర్ 9న ఎన్నికల షెడ్యూలు విడుదల కావడం, ఆ వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయడంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ₹50 వేల పరిమితికి మించి ఒక్కరూపాయి కూడా అదనంగా తీసుకెళ్లకుండా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయడం, బ్యాంకు లావాదేవీలపైనా ఎన్నికల సంఘం నిఘా పెట్టడంతో అనేక మంది క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. మందు, మద్యం, డబ్బు పంపకాలపై దృష్టి సారించిన ఎన్నికల కమిషన్ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ముమ్మర తనిఖీలు చేపట్టింది. జిల్లాలో పదుల సంఖ్యలో స్థిరాస్తుల అమ్మకం, కొనుగోలుదారుల నుంచి ఎంసీసీ తనిఖీల బృందం రూ.లక్షల్లో డబ్బులు స్వాధీనం చేసుకుంది. ఈ మొత్తాన్ని ఆదాయపన్ను శాఖకు అప్పగించడం, సంబంధిత సొమ్ముకు సంబంధించిన ఆధారాలు చూపినా, తిరిగి ఇవ్వడంలో కనబరిచిన జాప్యంతో బాధితులు అష్టకష్టాలు పడ్డారు. ఈ క్రమంలో లావాదేవీలు నిర్వహించడంలో అత్యధిక మంది వెనుకంజ వేశారు. అమ్మకాలు, కొనుగోళ్లపై ఏమాత్రం ఆసక్తి చూపలేదు. ఈ ప్రభావం రిజిస్ట్రేషన్లపై తీవ్రంగా పడింది. దీంతో క్రయ, విక్రయాలు నెమ్మదించాయి. ప్రతిరోజూ రిజిస్ట్రేషన్లతో కిటకిటలాడే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు బోసిపోయాయి. శాఖకు రావాల్సిన ఆదాయం కూడా రెండు నెలల్లో తగ్గింది. అక్టోబర్ నెలలో ₹21 కోట్ల 20 లక్షల 94 వేల ఆదాయం రాగా, నవంబర్‌లో ₹17 కోట్ల 80 లక్షల 7 వేలు మాత్రమే ఆదాయం వచ్చింది. ఆ నెలలో 5758 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. షెడ్యూల్ విడుదలైన అక్టోబర్ 9 నుంచి డిసెంబర్ 3 వరకు ఉమ్మడి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అత్యధికంగా కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ₹9 కోట్ల వరకు ఆదాయం రాగా, అతి తక్కువగా మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ₹50 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో యథావిధిగా రిజిస్ట్రేషన్లు కొనసాగుతుండగా, రోజుకు భారీగానే ఆదాయం సమకూరుతున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

భీమేశ్వరాలయంలో సహస్ర దీపాలంకరణలో మహిళలు





### దేదీప్యమానం.. సహస్ర దీపోత్సవం

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాజన్న అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో సహస్ర దీపోత్సవం నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఇలా వివిధ దేవాలయాల్లో ఈ దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేశ్ తెలిపారు. మహిళలు స్వస్తిక్, లింగాకారంగా దీపాలు వెలిగించడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. ఇక్కడ సిరిసిల్ల మాజీ కౌన్సిలర్ పత్తిపాక పద్మ, ట్రస్ట్ సభ్యులు, వేములవాడకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

-వేములవాడ టౌన్, డిసెంబర్ 8


